
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శనివారం | 08 ఫిబ్రవరి 2025 పేజీలు 8

# ఐదు ఎకరాల్లో పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి

- గుర్తు తెలియని దుండగులు చేసిన నిర్వాకం
- దాదాపు లక్షల్లో నష్టం వాటిల్లిందని బాధితుడి ఆవేదన



2లో

ఐదు ఎకరాల్లో పంట కాలిపోయిన దృశ్యం

## పెద్దకడుబూరు మండలంలో

# దాహం..దాహం..!

- గ్రామాల్లో పనిచేయని రక్షిత మంచినీటి పథకాలు
- చెంతనే నీరున్న గ్రామాలకు అందని త్రాగునీరు..
- మంచినీటి కోసం వ్యవసాయ బోర్లు బావుల వద్దకు పరుగులు పెడుతున్న జనం..
- ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు వోట్టి నీటి మూటలేనా?
- నీటి బిందె ధర రూ.10లు నుండి రూ.20లు కోనుగోలు



నిండుగా ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు దృశ్యం



నిరుపయోగంగా మారిన రక్షిత పథకాలు

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** వేసవి కాలం సమీపిస్తున్నది. ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాను కేంద్ర. రాష్ట్ర ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చించి రక్షిత మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి ప్రారంభించారు.అయితే రక్షిత మంచి నీటి పథకాలుపనిచేయక అవి అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాస్త మూలన పడుతున్నాయి. మిగతా 2లో



కిలో మీటర్ల దూరం నుండి త్రాగునీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

## సచివాలయాలు ..

# పురిటి నొప్పులు




మిద్దూరు గ్రామ సచివాలయం

- నిర్వహణ గాలికి..పడకేసిన పరికరాలు
- ప్రభుత్వాలు ఏవైనా మారని తీరు
- సచివాలయాల్లో కనీస సౌకర్యాలు మృగ్యం
- సొంత నిధులు ఖర్చు చేసుకుంటున్న ఉద్యోగులు
- జీతాలు తక్కువ..ఖర్చులు ఎక్కువ
- నిర్వహణ నిధులు ఎక్కడా నీ చిరునామా..!

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** అది వైసీపీ ప్రభుత్వం... ప్రజల వద్దకు ప్రభుత్వ పాలన నినాదంతో మహాత్మాగాంధీ పుట్టిన రోజైన అక్టోబర్ 2వ తేదీ గ్రామ, వార్డు సచివాలయాలనుప్రభుత్వంఏర్పాటు చేసింది. ప్రతీ వార్డు, ప్రతీ గ్రామంలో సచివాలయాలను నెలకొల్పిన ప్రభుత్వం 544 సేవలను అందుబాటులోకి తెచ్చింది. మండలంలోని గ్రామాల ప్రజలు మండల కేంద్రాలకు వెళ్ళకుండా పట్టణాల్లో ప్రధాన కార్యాలయాలకు వెళ్ళకుండా ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లోనే ప్రజలకు నేరుగా సేవలు అందించే లక్ష్యంతో సచివాలయాలు పురుడు పోసుకున్నాయి. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వ పాలన ముగిసి కూటమి ప్రభుత్వ పాలన సాగుతుంది. నంద్యాల జిల్లాలోని సచివాలయాలు పురిటి నొప్పులు పడుతున్నాయి. పాలకులు నిర్వహణను గాలికి వదిలేశారు. పరికరాలు పడకేశాయి. సచివాలయాల్లో కనీస సౌకర్యాలు మిగతా 2లో

## రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన భూ సేకరణను

# త్వరితగతిన పూర్తి చేయాలి

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌భాషా

**కర్నూలు,మేజర్ న్యూస్ ప్రతినిధి :** రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన భూ సేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌భాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో రైల్వే అండర్ బ్రిడ్జి/రైల్వే ఓవర్ బ్రిడ్జి తదితర రైల్వే ప్రాజెక్టు నిర్మాణ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదోని వద్ద నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్,కౌతాళం,ఆదోని మండలాల లోని ఎరిగేరి,కుప్పగల్ గ్రామాల్లో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్,పెద్దకడుబూరు మండలం లోని గవిగట్టు గ్రామంలో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్,కోసిగిమండలం ఇరంగల్ గ్రామం వద్ద లెవెల్ క్రాసింగ్,ఆదోని మండలం కడితోట గ్రామం వద్ద లెవెల్ క్రాసింగ్, హాలహర్వి మండలం మిగతా 2లో

## నంద్యాల జిల్లాలో

# కిడ్నాప్ కలకలం

**-సీఎంవోను తాకిన కిడ్నాప్ సెగ..?**

**నంద్యాల, మేజర్ న్యూస్ బ్యూరో:** జిల్లాలోని ఒక నియోజకవర్గంలో విద్యుత్ శాఖ కాంట్రాక్టర్ బాబురావు కిడ్నాప్ కలకలం రేపుతుంది. అధికార పార్టీకి చెందిన కొందరు ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ బాబురావును కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డారని ఆయన ఆ శాఖ సీఎండికి ఫిర్యాదు చేశారు. సీఎండి నుంచి సీఎంఓ కార్యాలయానికి సమాచారం చేరడంతో సీఎంఓ కార్యాలయం స్పందించినట్లు తెలుస్తోంది. నంద్యాల జిల్లా ఎస్పీతో సీఎంఓ కార్యాలయ ఉన్నతాధికారులు మాట్లాడినట్లు విశ్వసనీయ వర్గాల నుంచి సమాచారం అందుతుంది. ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ బాబురావు తనపై అధికార పార్టీకి చెందిన ముఖ్యనేత ఒకరు, మరికొందరు కలిసి దాడికి పాల్పడినట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. చివరి సమాచారం అందేసరికి ఘటనపై పోలీస్ అధికారులు విచారణ జరుపుతున్నారు.

## జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు

# భాగస్వాములు కావాలి

- జిల్లా వృద్ధి రేటును పెంచండి
- బ్యాంకర్ల సమావేశంలో నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లా వృద్ధిరేటును గణనీయంగా పెంచేందుకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు జిల్లా యంత్రాంగానికి సంపూర్ణ సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్ని బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్‌ఎస్ హాలులో బ్యాంకు మేనేజర్ల జిల్లా ఓరియేంటేషన్ వర్క్‌షాపులో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, యూనియన్ బ్యాంక్ డీజీఎం సురేంద్రగౌడ్, ఎస్‌బీఐ రీజనల్ మిగతా 2లో




బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

# సచివాలయాలు.. పురిటి నొప్పులు

(మొదటి పేజి తరువాయి)

మృగ్యంగా మారాయి. సచివాలయాల నిర్వహణ కోసం ప్రభుత్వాలు విడుదల చేస్తున్న నిధులు ఎక్కడ అన్నది బేతాళ ప్రశ్నగా కనిపిస్తున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది.

నంద్యాల జిల్లాలో 516 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. ఆయా సచివాలయాల్లో 544 సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని మున్సిపాలిటిలు, నగర పంచాయతీలు, గ్రామ పంచాయతీల్లో వార్డు, గ్రామ సచివాలయాలు ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు సుదూర ప్రాంతాలలో ఉన్న ప్రధాన కార్యాలయాలకు వెళ్ళకుండా ఆయా వార్డు, గ్రామ సచివాలయాల్లోనే సేవలు అందించడమే లక్ష్యంగా గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలోని సచివాలయాల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ప్రధానంగా మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యాలతోపాటు సచివాలయాల క్లీనింగ్ తదితర సౌకర్యాల లేమితో కొట్టు మిట్టాడుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు పొందే జీతంతోనే అవసరమైన సేవలకు సొంత నిధులను ఖర్చు చేసుకుంటున్నారు. వచ్చే జీతం తక్కువ అయినా ఖర్చులు ఎక్కువ అవుతున్నా భరిస్తున్నారు. ప్రభుత్వం సచివాలయాల నిర్వహణ కోసం నిధులను విడుదల చేస్తుందా లేదా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారిపోయింది. ప్రభుత్వాలు నిధులను విడుదల చేస్తుంటే వాటిని ఎక్కడ ఖర్చు చేస్తున్నారో తెలియని పరిస్థితులు నెలకొన్నా యి. వైసీపీ ప్రభుత్వం సచివాలయాల ఏర్పాటు


నంద్యాల మున్సిపాలిటిలో వార్డు సచివాలయం



బండిఆత్మకూరులో గ్రామ సచివాలయం

సమయంలో అందుకు కావాల్సిన వస్తు, సామాగ్రిని అందించింది. 2019వ సంవత్సరంలో ఏర్పడిన సచివాలయాలు సుమారు ఆరు ఏళ్ళుగా ప్రజలకు అందుబా టులో ఉంటూ సేవలు అందిస్తున్నాయి. ప్రస్తుతం సచివాలయాల్లో చాలా చోట్ల ప్రింటర్లు పని చేయడం లేదు. స్కానర్లు అటకెక్కాయి. కంప్యూటర్లు చెడిపోయినా పని చేయించే నాథుడు కరవయ్యారు. చివరకు సచివాలయ ఉద్యోగులఫోన్‌లేస్కానర్లుగా మారిపోయాయి. ఫ్యాన్లు చెడిపోయినా రిపేరి చేయించే నాథుడి కోసం ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. చివరికి ప్రింటింగ్ పేపర్లు, స్టాప్లర్ పిన్స్ సరఫరా లేక ఉద్యోగులు సొంత నిధులను వెచ్చించిస్తున్నారు. సచివాల యాల్లో స్వీపర్లు లేక ఉద్యోగులే స్వీపర్ల అవతారం ఎత్తుతున్నారు. అటెండర్లను ప్రభుత్వాలు నియమించలేదు. గ్రామ సచివాలయాల్లో 11 మంది ఉద్యోగులు వార్డు సచివాయాల్లో పది మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. గ్రామ సచివాలయాల్లో గ్రేడ్ -5 పంచాయతీ సెక్రటరీ, వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రేడ్ -4 పంచాయతీ సెక్రటరీ ( డిజిటల్ అసిస్టెంట్) , ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్, గ్రేడ్-2 విలేజి రెవెన్యూ ఆఫీసర్, మహిళా పోలీసు, ఎఎన్ఎం, సర్వే అసిస్టెంట్, వెటర్నరీ అసిస్టెంట్ హార్టికల్చర్ అసిస్టెంట్ ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నారు. వార్డు సచివాలయాల్లో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్ర టరీ, గ్రేడ్ -2 వార్డు శానిటేషన్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ, గ్రేడ్ -2 అమ్యూనిటిస్ సెక్రటరీ, గ్రేడ్-2 వార్డు వెల్ఫేర్ మరియు డెవలప్‌మెంట్ సెక్రటరీ , గ్రేడ్ -2 ప్లానింగ్ సెక్రటరీ, వార్డు మహిళా పోలీసు, వార్డు ఎనర్జీ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు రెవెన్యూ సెక్రటరీలు ప్రభుత్వ ఉద్యోగులుగా పని చేస్తున్నారు. వార్డు సచివాలయాలను మున్సిపాలిటిలు పర్యవేక్షిస్తుండగా గ్రామ సచివాలయాలను పంచాయతీ రాజ్ విభాగం పర్యవేక్షిస్తుంది. సచివాలయాల నిర్వహణలో ఆయా శాఖల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది. అందుబాటులో ఉన్న పరికరాలతోనే సచివాలయ ఉద్యోగులు ప్రజలకు సేవలు అందిస్తూ ప్రభు త్వానికి ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గడచిన ఏడు నెలలుగా సర్వేల పేరుతోనే సచివాలయ ఉద్యోగులను వినియోగించుకుంటుండటంతో ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి కనిపిస్తుంది. గత ఆరు సంవత్సరాలుగా బిఎల్ఓలకు రావాల్సిన ఎన్నికల నిర్వహణ నగదు ఇప్పటి వరకు జిల్లా ఉన్నతాధికారులు అందించకపోవడం కొసమెరుపు.

# జిల్లా అభివృద్ధిలో బ్యాంకర్లు భాగస్వాములు కావాలి

(మొదటి పేజి తరువాయి)

మేనేజర్ సూర్యప్రకాష్, ఏపీజీబీ రీజనల్ మేనేజర్ వెంకటరమణ, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ డీజీఎం ఉమామహేశ్వరరెడ్డి, సీనియర్ మార్కెటింగ్ ఆఫీసర్ కిరణ్‌ప్రభు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్ అన్ని బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు జిల్లా ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాలు, పర్యాటక రంగం, బలహీన వర్గాల కాలనీల్లో మౌళిక సదుపాయాల కల్పన తదితర ప్రాథమిక రంగాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి రుణాలు విరివిగా మంజూరు చేయడంలో బ్యాంకర్లు ముఖ్యభూమిక పోషించి జిల్లా వృద్ధిరేటును గణనీయంగా పెంచేందుకు తమవంతు కృషి చేయాలన్నారు. కోస్టల్ తరహాలో మూడు పంటలు పండించే భూములు నంద్యాల జిల్లాలో ఉన్నాయన్నారు. పేదరిక నిర్మూలనకు బ్యాంకర్లు ముందుకు రావాలన్నారు. సప్తనదుల సంగమం సంగమేశ్వరం కృష్ణానది పరివాహక ప్రాంతంలో సాగునీటి కాలువల కింద 5.97లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేసుకుంటారని రైతులకు అవసరమైన సమయంలో జాప్యం చేయకుండా పంట రుణాల మంజూరుకు బ్యాంకర్లు ముందుకు రావాలన్నారు. ఎల్లో ఖర్జూర, అవకాడో, ఆయిల్‌ఫామ్, సుగంధ అరటి, డ్రాగన్‌ఫ్రూట్ తదితర వాణిజ్య పంటలకు జిల్లాలోని భూములు అనుకూలంగా ఉన్నాయని అలాంటి రైతులను ప్రోత్సహించాలన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలను ఇచ్చే పంటలకు, స్థిరమైన వ్యవసాయ ఉత్పత్తులకు బ్యాంకర్లు చేయూతనందించాలన్నారు. 70వేల హెక్టార్లలో రైతులు ఒక పంట మాత్రమే వేసుకుని ఖాళీగా ఉంచుతున్నారని సంబంధిత భూములలో సాగుచేసేందుకు రుణాలు అందించాలన్నారు. జిల్లాలో ఉన్న 129మైనర్ ఇరిగేషన్ ట్యాంకులలో కోటి చేపపిల్లలు పెంచుకొనే స్థాయికి జిల్లా రావాలని ఇందుకు బ్యాంకర్లు తోడ్పాటును అందించాలన్నారు. అధిక పాలను ఇచ్చే గేదె కొనుగోలు చేసే పాడి రైతులకు రుణాలు ఇచ్చి సహకరించాలన్నారు. జిల్లాలో 48 చెంచుగూడెంలలో పదివేల మంది గిరిజనులు నివాసం ఉంటున్నారని పీఎం జన్మన్ కింద 527గృహాలు నిర్మాణం చేసి ఇచ్చేందుకు ఏజెన్సీలు ముందుకు రావాలని ఇందుకు బ్యాంకర్లు సహకరించాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. జిల్లాలో 21 పుణ్యక్షేత్రాలను అనుసంధానం చేస్తూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు బ్యాంకర్లు తోడ్పాటు అందించాలన్నారు. జేసీ మాట్లాడుతూ బ్యాంకర్లు, జిల్లా అధికారులు పరస్పర సమన్వయంతో కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. సమన్వయ లోపం ఏర్పడితే లబ్ధిదారులకు నష్టం జరగడంతో పాటు దేశవృద్ధి రేటు కూడా కుంటుపడే అవకాశం ఉందన్నారు. అనంతరం వ్యవసాయ, అనుబంధ రంగాల అధికారులు, తదితర శాఖల అధికారులకు మార్గదర్శక సూత్రాలను బ్యాంకర్లకు వివరించారు.

## కష్టాలు తీర్చే స్వామి.. శ్రీ ఆంజనేయస్వామి..

**ఎమ్మిగనూరు, మేజర్ న్యూస్:** ఆదోని బైపాస్ రోడ్డు పెద్దపార్కుకు వెళ్లే రోడ్డులో.. కోరిన కోరికలు తీరుస్తూ కొంగుబంగారంగా కొలువై ఉన్న శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయం ఎమ్మిగనూరు పట్టణంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. పట్టణంలోని స్థానికులు, మహిళలు, వృద్ధులు సైతం ఆ స్వామిని దర్శించుకుని ఆహ్లాదకర వాతావరణంలో ప్రజలంతా ఆధ్యాత్మిక ఆనందం పొందుతున్నారు. సమస్త గ్రహ పీడలు తొలగించే హనుమ భక్తుల పాలిట కల్ప తరువుగా, వర ప్రదాతగా పిలవబడే శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకోవడం వలన సమస్త భూత, ప్రేత, దుష్ట గ్రహ పీడ తొలగిపోతాయని ఎమ్మిగనూరు ప్రజల విశ్వాసం. నిత్యం రహదారిలో వెళ్లే వాహనదారులు, విద్యార్థులు, దారిన వెళ్లే పాదచారులు స్వామివారిని దర్శించుకునే అక్కడి నుంచి కొనసాగుతారు. ఈ గుడిలో కాసేపు కూచుని భక్తి శ్రద్ధలతో హనుమాన్ చాలీసా చదువుకుని ఇంటికి చేరితే శుభప్రదమని భక్తులు భావిస్తారు. ప్రతి శనివారం ఈ ఆలయానికి భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. ఎంతటి కష్టాలు అయినా సరే


రావూస్ డిగ్రీ కాలేజ్ ఎదురుగా కొలువైఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం

శ్రీ ఆంజనేయస్వామి వారిని దర్శిస్తే ఆ కష్టాలు తొలగిపోతాయన్న నమ్మకం ఇక్కడి భక్తుల్లో బలంగా నెలకొని ఉంది.

# పెద్దకడుబూరు మండలంలో దాహం.. దాహం..!

(మొదటి పేజి తరువాయి)

దీంతో గ్రామల్లో త్రాగునీటి కోసం దాహం.. దాహం అంటూ అల్లాడుపోతున్నారు. మంత్రాలయం నియోజకవర్గం పెద్దకడుబూరు మండలంలో సుమారుగా 28గ్రామాలు ఉన్నాయి. మండలంలో జనాభా విషయానికి వస్తే 65వేలకు పైగా జనాభా ఉంది. అలాగే మండలంలో 3 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులు. చేతి పంపు బోర్లు 200లు సిపిడబ్ల్యూఎస్ స్కీంబోర్లు 86 ఓహెచ్‌ఆర్ ట్యాంకులు 20 జలజీవన్ మిషన్ పథకం కింద ఓహెచ్‌ఆర్ ట్యాంకులు 12 అందులో 10 నీటి ట్యాంకులు పూర్తి మిగిలిన 2 ట్యాంకులు పూర్తి అసంపూర్తిగా ఉన్నాయి. ఇవన్ని పూర్తి అయి ఉంటే గ్రామాలలో ఉన్న ప్రజలకు తాగునీరు సమృద్ధిగా లభించేది. అయితే ప్రజాప్రతినిధులు. అధికారులు గాని తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో అవి మూలన పడి ఎటు పనికి రాకుండా పోతున్నాయన్న విమర్శలు ప్రజలు నుండి వినిపిస్తున్నాయి.త్రాగునీటి ఎద్దడి గ్రామాల్లో ఏర్పడడంతో ప్రజలు తమ దాహం తీర్చుకొనేందుకు కిలోమీటర్ల దూరం నుండి తాగునీటిని తెచ్చుకొని తమ దాహం తీర్చుకుంటున్నారు.మరి కొందరు మినరల్ వాటర్‌కు అలవాటు పడి బిందె నీళ్లు రూ.10 నుండి రూ.20 వరకు వెచ్చించి కొనుగోలు చేసుకొని త్రాగుతున్నారు.ప్రజల దాహం తీర్చాల్సిన రక్షిత మంచినీటి పథకాలు ఇలా నిర్వీర్యం అయితే ప్రజలు ఎలా బ్రతకాలంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.ఎండకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో తాగునీటి పరిస్థితి ఇలా ఉంటే ..ఎండకాలంలో ఎలా ఉంటుందోనన్న భయాందోళనలో గ్రామాల ప్రజలు అధికారుల పై నాయకుల పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఎన్నికల సమయంలోనే ఓట్ల కోసం నాయకులకు మేము గుర్తుకు వస్తామా..సమస్యలు ఉన్నప్పుడు ఎవ్వరు పట్టించుకోరా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా మండల ప్రజాధనాన్ని గర్తురేగి అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలను పూర్తి చేసి గ్రామాలకు మంచినీటి సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# ఐదు ఎకరాల్లో పచ్చని చెట్లు అగ్నికి ఆహుతి



**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** ఐదు ఎకరాలలో నాటిన ఎర్రచందనం ,మహాగని,శ్రీగంధం, టేకు వంటి పచ్చని చెట్లు గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టడంతో అగ్నికి ఆహుతి అయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.మండల పరిధిలోని చుంచుఎర్రగుడి గ్రామానికి చెందిన రైతు బండారి మద్దిలేటికి చెందిన ఐదు ఎకరాలలో ఏడు సంవత్సరాల క్రితం ఎర్రచందనం ,మహాగని,శ్రీగంధం,టేకు వంటి పంటలను నాటారు. పంట కాపుకాచే సమయానికి శుకవారం గుర్తు తెలియని దుండగులు నిప్పు పెట్టారు. విషయం తెలుసుకున్న రైతు బండారి తన పొలం వద్దకు వెళ్లి పరిశీలించి బోరుబోరున విలపించాడు.ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ చేతికి అందే పంటను చేతికి దక్కకుండగా చేయాలని గుర్తు తెలియని దుండగులు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని బాధితుడు ఆరోపించాడు.త్వరలోనే పంట పండి అప్పులన్ని తీరుతాయని ఆశపడ్డా..తమ ఆశలన్నీ అడిఆశలయ్యాయని విలపించాడు.పచ్చని పైర్లతో పాటు డ్రిప్పులు,పైపులు మాడిమసి అయిపోయాయని వారు బాధను వెల్లబుచ్చారు.దాదాపు లక్షల్లో నష్టం వాటిల్లినట్లు పలువురు చర్చించుకుంటున్నారు. బాధితుడు తనకు జరిగిన నష్టానికి కృష్ణగిరి పోలీసులను ఆశ్రయిస్తానని తెలిపారు.

### రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన భూ సేకరణను

# త్వరితగతిన పూర్తి చేయాలి

(మొదటి పేజి తరువాయి)

సాకిబండ గ్రామం వద్ద లెవెల్ క్రాసింగ్,కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామం సమీపంలో నిర్మించనున్న లెవెల్ క్రాసింగ్‌ల పురోగతిపై కలెక్టర్ అధికారులతో చర్చించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ,ఇతర ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఆదోని డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న లెవెల్ క్రాసింగ్ గేట్స్ ప్రాజెక్ట్స్ 201,207లను మే నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి నవ్య,అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి,డిఆర్ఓ వెంకట నారాయణమ్మ,కర్నూల ఆర్డీఓ సందీప్ కుమార్,ఆర్అండ్‌బి ఎస్ఈ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

# నేర నియంత్రణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు, శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్‌ను పోలీసులు శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా రహదారుల్లో విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. అక్రమ మద్యం, గంజాయి, తదితర నిషేధిత వస్తువులు రవాణా జరుగకుండా అడ్డుకట్ట వేసే విధంగా వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రధాన కూడలి ప్రాంతాలు, రహదారులలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. పట్టణ శివారు ప్రాంతాలు, నేరాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో డ్రోన్‌లతో పరిశీలించారు. అనంతరం హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కల్పించి ట్రిబుల్ డ్రైవింగ్, నియమాలు పాటించని వారిపై చర్యలు తీసుకున్నారు. రోడ్డు నియమాలను పాటించాలని కోరారు.



# ఉరకలేసిన ఉత్సాహం

- కన్నుల పండుగలా బాలోత్సవం
- రెండ్రోజుల పాటు వెల్లివిరిసిన సృజనాత్మకత



నృత్యం చేస్తున్న చిన్నారులు

**కర్నూలు స్పోర్ట్స్,మేజర్ న్యూస్ :** కర్నూలు నగర శివార్లలోని మాంటిసోరి ఇండస్ పాఠశాల వేదికగా రెండ్రోజుల పాటు సాగిన పిల్లల పండుగ 4వ కర్నూలు బాలోత్సవంలో విద్యార్థుల్లో ఉత్సాహం ఉరకలేసింది. రెండ్రోజుల పాటు బాలోత్సవం కన్నుల పండుగలా సాగి శుక్రవారం ముగిసింది. విద్యార్థులు తమ నైపుణ్యాలను చక్కగా ప్రదర్శించి అబ్బురపరిచారు. రెండోరోజు 27అంశాల్లో పోటీలను నిర్వహించారు. జానపద నృత్యం,విచిత్ర వేషాధారణ,ఏకపాత్రాభినయం, కోలాటం నిర్వహించారు. మధ్యాహ్నం బాలోత్సవం అధ్యక్షులు బడేసాహెబ్ అధ్యక్షతన ముగింపు సభ నిర్వహించారు. తొలుత ఢీ టైటిల్ విన్నర్ హేమంత్ తన నృత్య ప్రదర్శనతో అలరించారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. డిఈఓ శామ్యూల్ పాల్ మాట్లాడుతూ ఇంతమంది విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొనడం జిల్లా విద్యా శాఖకే గర్వకారణమన్నారు. ఏపిఎస్‌పి బెటాలియన్ డిఎస్పీ మహబూబ్ భాషా మాట్లాడుతూ పిల్లలు మంచి ప్రదర్శనలు ఇస్తున్నారని పాల్గొనేందుకు చాలా తపన పడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆణిముత్యాలను బయటకు తీయడానికి కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బలోత్సవం కమిటీ రాష్ట్ర నాయకులు రామరాజు,మాంటిసోరి విద్యాసంస్థల సిఈఓ విల్సన్,ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్,యుటిఎఫ్ రాష్ట్ర సహధ్యక్షులు సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విజయమే లక్ష్యంగా క్రీడాకారులు పోరాడాలి

- విశ్రాంత డీ ఎస్పీ మెహబూబ్ బాషా



బహుమతులను అందచేస్తున్న విశ్రాంత డీఎస్పీ

**కర్నూలు స్పోర్ట్స్,మేజర్ న్యూస్ :** క్రీడ ఏదైనా క్రీడాకారులు మాత్రం విజయమే లక్ష్యంగా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలవాలని విశ్రాంత డీఎస్పీ మెహబూబ్ భాషా అన్నారు. శుక్రవారం నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాల క్రీడామైదానం నందు ఉమ్మడి క ర్నూలు జిల్లా స్థాయి జూని యర్స్ నెట్‌బాల్ ఎంపిక పోటీలను జిల్లా అధ్యక్షులు నాగేశ్వరబాబుతో కలిసి విశ్రాంత డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 16వరకు తూర్పు గోదావరి జిల్లా రావుల పాలెంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరుపున పాల్గొని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. అనంతరం గెలుపొందిన విజేతలకు బహుమతులను అందచేశారు. ఈ కార్యక్రమంలో నెట్‌బాల్ సంఘం వ్యవస్థాపకుడు నాగరత్నమయ్య,కార్యదర్శి వంశీకృష్ణ,చరణ్, గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

- డీఎస్పీ రామాంజనేయ నాయక్
- వాహనదారులు రోడ్డు నియమాలు పాటించాలి
- రూరల్ సీఐ సుబ్రమణ్యం





మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయ నాయక్

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** ద్విచ్ర వాహనదారులు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయ నాయక్ తెలిపారు. మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మకూరు డీఎస్పీ రామాంజనేయ నాయక్, నందికొట్కూరు రూరల్ సిఐ సుబ్రమణ్యంలు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామాంజనేయ నాయక్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే ప్రమాదం నుంచి తప్పించుకునే అవకాశం ఉందన్నారు. హెల్మెట్ లేకపోవడంతో చాలా మంది తీవ్ర గాయాలపాలై ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. అనంతరం రూరల్ సిఐ సుబ్రమణ్యం మాట్లాడుతూ వాహనదారులు, ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని అన్నారు. అతివేగంగా వాహనాలు నడపరాదని అన్నారు. గ్రామంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా అందరూ ఐక్యమత్యంగా ఉండి గ్రామంలో ప్రశాంత వాతావరణాన్ని కల్పించాలని గ్రామస్తులను కోరారు. వాహనదారులు లైసెన్స్, తదితర పత్రాలు కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణ రెడ్డి, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గిరీశ్వర్ రెడ్డి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రమాబాయ్ అంబేద్కర్ 127వ జయంతి



రమాభాయ్ అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మహిళలు

**కల్లూరు,మేజర్ న్యూస్ :** నగరంలోని స్థానిక బి క్యాంపు నందు గల ఎస్‌సి, ఎస్‌టి ,బిసి,మైనార్టీ, మహిళా ఐక్య వేదిక ప్రధాన కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ ఆధ్వర్యంలో రమాభాయి అంబేద్కర్ 127వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి,రాయలసీమ అధ్యక్షురాలు భారతమ్మలు రమాభాయ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటితరం మహిళలకు రమాభాయ్ ఆదర్శమని రమాభాయ్ అంబేద్కర్ అంటేనే పోరాటం, త్యాగం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈరమ్మ,ఎలిశమ్మ,కటిక భాను,పద్మావతి,హుసేన్‌బీ, దస్తగిరమ్మ, కొమ్ము పెద్దక్క,సేకున్ బీ,లక్ష్మేశ్వరి,కన్యాకుమారిలు పాల్గొన్నారు.

# సోలార్ ప్లాంట్ సందర్శన



సోలార్‌ప్లాంట్‌ను సందర్శించిన శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** నెరవాడ శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు మిట్టకందాల సోలార్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్‌ను సందర్శించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమల సందర్శనకు వెళ్ళడం ద్వారా ప్రాక్టికల్ అనుభవం వస్తుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శేషయ్య, అధ్యాపకులు అల్లావుద్దీన్, లోకేష్, శిరీష, చాంద్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.



సోలార్‌ప్లాంట్‌ను సందర్శించిన శాంతిరాం ఇంజనీరింగ్ విద్యార్థులు

# ఎస్సీ, ఎస్టీ కేసుపై డీఎస్పీ విచారణ

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండలం చెట్నేపల్లికి చెందిన పలువురిపై అగ్రకులాలపై ఎస్సీ, ఎస్టీ నమోదైంది. శుక్రవారం ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు ఎస్.ఐ శివాంజల్‌తో కలిసి గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలో ఎస్సీలను కులం పేరుతో అదే గ్రామానికి చెందిన కొంతమంది అగ్రవర్ణాల వారు దూషించినట్లు గ్రామంలోని ఎస్సీలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనకు కారణమైన సర్వే నెం.113భూమిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ భీమన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన శుక్రవారం మండల పరిధిలోని నల్లకాల్వ గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే నల్లకాల్వ గ్రామానికి చెందిన సుమిత్ర(60) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. సూసైడ్ లెటర్ రాసి ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# విద్యార్థులు పరీక్షల పట్ల భయం వీడాలి



ఓపెన్ హౌస్‌ను ప్రారంభిస్తున్న డిఈఓ

**కోవెలకుంట్ల, మేజర్ న్యూస్ :** విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కోవెలకుంట్లలోని సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత శిక్షణరాలకు చేరుకోవాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఎంఈఓలు వెంకటరామి రెడ్డి, వెంకట సుబ్బయ్య, హెచ్‌ఎం రాజయ్య, పాల్గొన్నారు.

# నగరపాలక పీఆర్‌ఓ బదిలీ



**కర్నూలు నగరం,మేజర్ న్యూస్ :** కర్నూలు నగరపాలక సంస్థ సూపరింటెండెంట్,ప్రజా సంబంధాల అధికారి ఏ.వి. రమేష్ బాబు బదిలీ అయ్యారు. గూడూరు నగర పంచాయతీ కమీషనర్‌గా నియమిస్తూ శుక్రవారం పురపాలక శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గూడూరు కమీషనర్‌గా పనిచేస్తున్న బి. నాగరాజును కర్నూలు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య పర్యవేక్షకులుగా నియమించారు. కాగా గతంలో ఏ.వి రమేష్‌బాబు ఆళ్లగడ్డ,డోన్ మున్సిపాలిటీల్లో కమీషనర్‌గా పనిచేశారు.

# అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలి - ఆర్డీఓ



మాట్లాడుతున్న ఆర్డీఓ భరత్ నాయక్

**తుగ్గలి,మేజర్ న్యూస్ :** ప్రభుత్వ అధికారులు గ్రామీణ ప్రాంతాలలోనే ప్రజల సమస్యలను పరిష్కరించి ప్రజలతో ప్రభుత్వ ఉద్యోగులు మన్ననలు పొందాలని పత్తికొండ ఆర్డీఓ డాక్టర్ భరత్ నాయక్ అన్నారు. శుక్రవారం తుగ్గలిలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ భరత్ నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వివిధ గ్రామాల నుండి ప్రజలు తమ సమస్యలను తెలియజేసేందుకు అధికారుల వద్దకు వచ్చినప్పుడు అధికారులు ఓపికతో వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఒకవేళ ఆ సమస్యలు మీ పరిధిలో లేకపోతే ఉన్నతాధికారుల వద్దకు వెళ్లాలని ప్రజలకు తెలపాలని ఆయన తెలియజేశారు. అలాగే భూ సమస్యలను పొడిగించకుండ వాటిని రాజీమార్గంలో పరిష్కరించి ఇరువురికి న్యాయం జరిగే విధంగా చూడాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రమాదేవి,డిప్యూటీ తహశీల్దార్ నాగరాజు,మండల సర్వేయర్ సుధాకర్,సీనియర్ అసిస్టెంట్ రాముడు,విఆర్ఓలు తదితరులు పాల్గొన్నారు.

# గంజహల్లి బడేసాహెబ్ స్వామికి వెండిపాదుకలు సమర్పించిన భక్తులు



బడేసాహెబ్ స్వామికి భక్తులు సమర్పించిన వెండిపాదుకలకు పూజలు నిర్వహిస్తున్న పీఠాధిపతి చిన్న ముద్దుగోల్ స్వామి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** గంజహళ్లి గ్రామంలో వెలసిన మహత్మబడేసాహెబ్ స్వామి వారికి గంజహళ్లి గ్రామానికి చెందిన త్రివిక్రం రెడ్డి, అతని తల్లిదండ్రులు ప్రతాపరెడ్డి, అరంజ్యోతి దంపతులు స్వామి వారికి రూ.70వేలు విలువ చేసే వెండి పాదుకలను శుక్రవారం దర్గ ధర్మకర్త కుబేర్‌రెడ్డికు అందజేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త స్వామి వారి పాదుకలను బడేసాహెబ్ స్వామి వారి మునిమనవడు పీఠాధిపతి చిన్న ముద్దుగోలు స్వామి చే ప్రత్యేక పూజలు చేయించారు. స్వామివారికి అందజేసిన పాదుకలను భక్తుల దర్శనార్థం స్వామి వారి జీవసమాధి దగ్గర ఉంచారు. ఈ కార్యక్రమంలో దర్గా సొసైటీ సభ్యులు దర్గా బడేసాహెబ్, చిన్నఖాసింవలి, భక్తులు ఉన్నారు.

సూర్య



# టౌన్ బ్యాంక్ సేవలను పల్లెలకూ విస్తరింప చేస్తాం

- చిరు వ్యాపారులకు కూడా ఋణాలిచ్చి ఆదుకుంటాం
- బీజేపీ, జనసేన నాయకులకు బ్యాంక్ పాలకవర్గంలో చోటిచ్చి కూటమి ధర్మాన్ని పాటించాం
- టౌన్ బ్యాంక్ పాలకవర్గం ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ




ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ



టౌన్ బ్యాంక్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేస్తున్న ఉరుకుందయ్య శెట్టి



డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న నవీన్ కుమార్



డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేస్తున్న గిరిధర్

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ఎంతో గొప్ప ఆలోచనతో పద్మశ్రీ మాచాని సోమప్ప నెలకొల్పిన ఎమ్మిగనూరు కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సేవలను పట్టణంకు కాకుండా నియోజకవర్గం పరిధిలోని పల్లెలకు విస్తరిం ప చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. టౌన్ బ్యాంక్ నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం శుక్రవారం అట్టహాసంగా ఎమ్మెల్యే బీవీ ఆధ్వర్యంలో జరిగింది. ఎమ్మిగనూరు టౌన్ బ్యాంక్ చైర్మన్ గా ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి, వైస్ చైర్మన్ గా బండా నరసప్ప, డైరెక్టర్లుగా మహబూబ్ బాషా, రవికుమార్, వాల్మిక రాజు, వెంకటేశ్వర రెడ్డి, నరసింహులు, నవీన్ కుమార్, షాలేం, వెంకటగిరి, భీమేషులకు ఎమ్మెల్యే బీవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూపద్మశ్రీ మాచాని సోమప్ప స్థాపించిన టౌన్ బ్యాంకును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వాలు మారిన కూడా ఎంతో పేరు పొందిన టౌన్ బ్యాంకు ముందుకు పోతుందన్నారు. అనుభవం, యువతరం, సామాజిక కోణంలో నూతన టౌన్ బ్యాంక్ పాలకవర్గం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో 2014 –19లో ఇదే చైర్మన్ గా ప్రతాప్ ఉరుకుందయ్య శెట్టి ఎంతో గొప్పగా ముందుకు తీసుకెళ్లి ఎన్పిఏ ను 11 శాతానికి తీసుకొచ్చారని తెలిపారు. గత ప్రభుత్వంలో 11 శాతానికి ఉన్న 14 శాతానికి తీసుకొచ్చారని తెలిపారు. చిరు వ్యాపారులకు, చేనేత కార్మికులకు రుణాలు ఇచ్చి పాలకవర్గం మంచి నిర్ణయాలతో ముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. టౌన్ బ్యాంకు బిల్డింగ్ పై భవనాలు కట్టి స్కిల్ ఆక్టివిటీస్ పెట్టే విధంగా నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలిపా రు. సామాజిక కోణంలో పరిశీలించిన తర్వాతే పాలకవర్గం ఏర్పాటు చేసిందని, రాష్ట్రంలోని కూటమి పాలనలో భాగంగా ఎమ్మిగనూరులో టౌన్ బ్యాంకు పాలకవర్గం లో టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు అవకాశం కల్పించడం జరిగిందన్నారు. టౌన్ బ్యాంక్ వైస్ చైర్మన్ నర్సప్ప గుమస్తా కాదు అని మూడో వార్డులో పార్టీ జనరల్ సెక్రటరీగా ఉన్నారని గుర్తు చేశారు. కొందరు గిట్టని వారు అసత్య ప్రచారాలు చేస్తారని వారి ప్రచారాలు పట్టించుకోవ ద్దన్నారు. సభ్యులకు వచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రజలకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించా లని ఎమ్మెల్యే బీవీ కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపి, జనసేన, బీజేపీ నాయకులు, పార్టీ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

**- మరోసారి చైర్మన్ గా ఆకాశం రావడం సంతోషంగా ఉంది :**

ఎమ్మిగనూరు కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్ గా తనకు ఏడు పదుల వయసులో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి రెండోసారి అవకాశం కల్పించడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని బ్యాంక్ చైర్మన్ ఉరుకుందయ్య శెట్టి పేర్కొన్నారు. ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 2014 –19 లో తాను చైర్మన్ గా ఉన్న సమయం లో బ్యాంకు ఎన్ పిఏను 11 శాతానికి తీసుకొచ్చానని, 2019–24 లో 14 శాతానికి పెరిగిందన్నారు. దీన్ని తగ్గించి చిరు వ్యాపారస్తులకు రుణాలు అందించి వారి ఆర్థిక అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. పేదల కోసం పద్మశ్రీ మాచాని సోపప్ప స్థాపించిన బ్యాంకును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు.

## క్రీడాకారులకు నజరానా అందించిన ప్రభుత్వం

**– క్రీడాకారుల తరుపున కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం నేతలు**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

**కర్నూలు స్పోర్ట్స్,మేజర్ న్యూస్ :** గత ఏడాది గోవాలో జరిగిన జాతీయ క్రీడలతో పాటు వివిధ క్రీడల్లో జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన 189 మంది క్రీడాకారులకు మన రాష్ట్ర ప్రభుత్వం రూ.7.91 కోట్లను నజరానాలను మంజూరు చేసింది. ఈ సందర్భంగా శుక్రవారం కర్నూలు జిల్లా ఒలంపిక్ సంఘం ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశాన్ని మీడియా పాయింట్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఒలంపిక్ సంఘం జిల్లా కార్యదర్శి జి శ్రీనివాసులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడాకారుల సంక్షేమం కోసం పథకాలు సాధించిన క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను విడుదల చేయడం శుభపరిణామమన్నారు. క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలను అందించినందుకు రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో పాటు శాప్ చైర్మన్ రవినాయుడుకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ సంఘం కోశాధికారి శ్రీధర్,సంయుక్త కార్యదర్శులు శ్రీనివాసులు,అవినాష్‌శెట్టి,సభ్యులు ఈశ్వర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉయ్యాలవాడలో 18వ విడత సామాజిక తనిఖీ

**– రూ.1.30 లక్షల రికవరీకి ఆదేశాలు**




మాట్లాడుతున్న పీవో బాలాజీ నాయక్

**ఉయ్యాలవాడ, మేజర్‌న్యూస్ :** మండలంలో 2023 ఏప్రీల్ నుంచి 2024 మార్చి వరకు జాతీయ ఉపాధి హామీ పథ కంలో నిర్వహించిన పనులపై 18వ విడత సామాజిక తనిఖీ శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి బాలాజీ నాయక్ మాట్లాడుతూ రూ.6.27 కోట్లు వ్యయం చేసి 900 పనులను చేపట్టడం జరిగిందని అన్నారు. ఇందులో వేతనాలకు రూ.3.70 కోట్లు ఖర్చు కాగా, మెటీరియల్ కోసం రూ.2.57 కోట్లు ఖర్చు చేశారని అన్నారు. ఈ పనుల్లో జరిగిన అవకతవకల్లో రూ.1,30,304 రికవరీకి ఆదేశించామని అన్నారు. ఇందులో ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.12,635 వెంటనే రికవరీ చేయడం జరిగిందని అన్నారు. మిగిలిన మొత్తాన్ని కూడా వీలైనంత త్వరలో రికవరీ చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ సాంబశివరావు, స్టేట్ రీసోర్స్ పర్సన్ మురాథ్, క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాధర్‌రావు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఏపీవో రవిప్రకాశ్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పాల్గొన్నారు.

## ప్రాణం ఉన్నంత వరకు జగనన్న వెంటే ఉంటా..!

**– వైసిపి కర్నూలు నగర ఎస్‌సి సెల్ అధ్యక్షులు పరుశురామ్**



ఎస్‌వి మోహన్‌రెడ్డి,విజయ మనోహరిలను సన్మానిస్తున్న దళిత నాయకులు

**కల్లూరు , మేజర్ న్యూస్ :** తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు మాజీ ముఖ్యమంత్రి,వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటానని వైసిపి కర్నూలు నగర ఎస్‌సి సెల్ అధ్యక్షులు పరుశురామ్ అన్నారు. శుక్రవారం కర్నూలు నగర వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులుగా నియమకమైన పరుశురామ్ దళిత సోదరులతో కలిసి కర్నూలు జిల్లా వైసిపి అధ్యక్షులు మరియు లెజెండ్ సెక్యులర్ లీడర్,మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి,కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు ఎస్‌వి విజయ మనోహరిలను కలిసి బొకే అందచేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నగరంలో అన్నా అని పిలిస్తే పలుకే ఏకైక నాయకుడు ఎస్‌వి మోహన్‌రెడ్డి అని సాధారణ కార్యకర్తలమైన తమను నాయకులుగా తీర్చిదిద్దాడని ఎస్‌సి సెల్ అధ్యక్షులు కమతం పరుశురామ్ అన్నారు. ఎస్‌వి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అట్టడుగు వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాశపోగు ఏసు,నాగపురి వనష్,చోటు,చిన్న, అంజి తదితరులున్నారు.

## జిల్లా కాంగ్రెస్ ఎస్సీ,మైనార్టీ డిపార్ట్‌మెంట్ ఛైర్మెన్‌లుగా ఎస్‌సి బజారన్న,షేక్ ఖాజా హుస్సేన్



నియామక పత్రాలు అందచేస్తున్న నాయకులు

**కర్నూలు క్రైం,మేజర్ న్యూస్ :** కర్నూలు జిల్లా కాంగ్రెస్ ఎస్‌సి సెల్ చైర్మన్‌గా ఎన్సి బజారన్న,జిల్లా మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్‌గా షేక్ ఖాజా హుస్సేన్‌లు పదవీ బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే,టిటిడి బోర్డు మాజీ సభ్యులు మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై బజారన్న,షేక్ ఖాజా హుస్సేన్‌లకు నియామక పత్రం అందచేసి కండువాలతో సన్మానించారు. అనంతరం రాష్ట్ర మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ శాలి దాదా గాంధీని పూలమాల,శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు,నగర కాంగ్రెస్ అధ్యక్షులు షేక్ జిలాని భాష,నియోజకవర్గ కోఆర్డినేటర్లు ఎం కాసింవలి,రమేష్ యాదవ్,మురళీకృష్ణ,రాజు, సీనియర్ మైనార్టీ నాయకుడు అబ్దుల్ రహిమాన్,ఐఎన్‌టిసి జిల్లా అధ్యక్షులు బతుకన్న,జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకన్న,ఓబిసి సెల్ జిల్లా చైర్మన్ సాంబశివుడు,మహిళా నాయకురాలు ప్రమీళ,వెంకట సుజాత పాల్గొన్నారు.

## బాండెడ్ లేబర్,మానవ అక్రమణ పై న్యాయ సేవ సదన్




మాట్లాడుతున్న వక్తలు

**కర్నూలు,మేజర్ న్యూస్ ప్రతినిధి :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి లీలా వెంకట శేషాద్రి బాండెడ్ లేబర్ మరియు మానవ అక్రమ రవాణాపై వర్క్‌షాప్ వివిధ సంబంధిత శాఖల సమన్వయంతో న్యాయ సేవ సదన్ నిర్వహించారు. ఈ సందర్భంగా శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ వెంకట హరినాథ్,డిస్ట్రిక్ట్ కమీషనర్ ఆఫ్ లేబర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బాండెడ్ లేబర్ గుర్తింపు మరియు రెస్క్యూ ప్రక్రియ గురించి వివరించారు. అనంతరం న్యాయసేవ సదన్ నుండి కొండారెడ్డి బురుజు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దిశ పోలీస్ డిఎస్పీ శ్రీనివాసచారి, సార్డ్స్ పిడి దయాకర్,అకౌంట్స్ ఆఫీసర్ శివ,అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ సాంబశివరావు,సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సూపరింటెండెంట్ శివారెడ్డి,డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు,లక్ష్మి,పానెల్ న్యాయవాదులు,పారా లీగల్ వాలంటీర్లు,దుకాణ కార్మికులు పాల్గొన్నారు.

## ఏపి వక్ఫ్ ట్రిబ్యునల్ ఛైర్మెన్‌లుగా లక్ష్మీరాజ్యం



చైర్మన్ లక్ష్మిరాజ్యంకు శుభాకాంక్షలు తెలుపుతున్న సూపరింటెండెంట్ రాము

**కల్లూరు,మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా వి. లక్ష్మి రాజ్యం శుక్రవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో చైర్మన్‌గా విధులు నిర్వహించిన జడ్జి భూపాల్‌రెడ్డి స్థానంలో వి లక్ష్మిరాజ్యం పదవీ బాధ్యతలు చేపట్టారు. పదవీ బాధ్యతలు చేపట్టి లక్ష్మిరాజ్యంకు న్యాయవా దు లు, సూపరిం టెండెంట్ రాము,జూనియర్ అసిస్టెంట్ సుభాన్‌తో పాటు పలువరు పుష్పగుచ్చం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

# రమణీయం శ్రీ సిద్దేశ్వరస్వామి రథోత్సవం



**హొళగుంద,మేజర్‌న్యూస్ :** హొళగుందలోని కొండ గుహలో కొలువైన శ్రీ సిద్దేశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం తేరు వీధిలోని ఆశేష భక్తజనుల మధ్య రమణీయంగా జరిగింది.స్వామి వారి దేవాలయంలో సిద్దేశ్వర,సిద్దమ్మల కల్యాణోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.భక్తులు స్వామి వారికి నైవేద్యలు,రథానికి తెల్ల పటాలను ధరించడానికి మేళాతాళాలతో వచ్చి స్వామి వారికి ప్రత్యేకంగా పూజలు చేయించారు. దేవాలయంలో భక్తులు కిక్కరించిపోవడంతో ఎస్ఐ బాలనరసింహులు పోలీసు సిబ్బంది తో బంధోస్తును ఏర్పాటు చేసి భక్తులను క్యూ పద్దతి ద్వార దర్శనానికి వెళ్ళడానికి అవకాశం కల్పించారు.స్థానిక బీసి ఇతర కాలనిలకు చెందిన యూత్ సభ్యులు, భక్తులు ట్రాక్టర్‌లో గజమాలను ఊరేగింపుగా వచ్చి రథానికి అలంకరిం చారు.సాయంత్రం తేరు వీధిలో ఆశేష భక్తజనం మధ్యలో రథోత్సవాన్ని ఎదురు బసవన్న గుడి వరకు లాగారు.రథోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బంధోబస్తును ఏర్పాటు చేశారు.కార్యక్రమం లో నిర్వహకులు పంపనగౌడ,శివనగౌడ, సిద్దార్థగౌడ,భక్తులు అధిక సంఖ్యలో పాల్గోన్నారు.



# ఎర్రబాడు చెరువుకు హంద్రీనీవా నీటిని విడుదల చేయండి

## – ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** ఎర్రబాడు చెరువులకు హంద్రీనీవా నుంచి నీటిని వెంటనే విడుదల చేసి చెరువులను నీటి తో నింపాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి హంద్రీనీవా ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎర్రబాడు గ్రామంలో ఓ ప్రవేట్ కార్యక్రమానికి హజరయ్యారు. అనంతరం హంద్రీనీవా డీఈఈ వరప్రసాద్, లక్ష్మినాయక్, ఏఈ నజీర్, ఆగ్రామ టీడీపీ నాయకులు, రైతులతో సమావేశం అయ్యారు. ఎర్రబాడు చెరువు పరిస్థితిని హంద్రీనీవా కాలువల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ జయ శ్రీ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో కొందరు చెరువులకు నీటి విడుదల చేస్తామంటు రైతుల దగ్గర సొమ్మును వసూళ్లు చేయడం తప్పుపట్టారు. కూటమీ ప్రభుత్వం ప్రజల, రైతు సంక్షేమ ప్రభుత్వం అని నీతి నిజాయితితో పనిచేస్తుందని ఆయన అన్నారు. ఎర్రబాడు చెరువుకు నీరు విడుదల అయితే ఎర్రబాడుతోపాటు చుట్టపక్కల ఉన్న గ్రామాలకు సాగు నీటితో పాటు తాగునీరు, వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి పోకుండా ఉంటాయని అందుచేత నీటిని హంద్రీనీవా నుంచి విడుదల చేయిస్తున్నామన్నారు. అయితే హంద్రీనీవా నుంచి ఎర్రబాడు చెరువుకు వచ్చే హంద్రీనీవా కాలువలు దెబ్బతిన్నాయని వాటిని మర్మత్తు చేయించాలని రైతులు కోరడంతో వెంటనే దెబ్బతిన్న కాలువలకు సంబందించి ఎస్టీమెట్ వేసి రెండు మూడు రోజులలో ఇవ్వాలని డీఈఈ, ఏఈలకు ఆదేశించారు. ఈవిషయం సీఎం చంద్రబాబుతో మాట్లాడి నిధులు విడుదల చేయించి జూన్, జూలై నెలలలోపు పనులు పూర్తి చేయించే విధంగా చర్యలు తీసుకుంటామని బీవీ అన్నారు. అనంతరం ఇరిగేషన్ అధికారులు దెబ్బతిన్న హంద్రీనీవా కాలువల దగ్గర కువెళ్లి పరిశీలించారు. హంద్రీనీవా నీరు విడుదల అవుతుండటంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ ఎర్రబాడు శ్రీనివాసులు, మౌలా, షెకావలి, ఏసు, ముళ్ల హుసేన్ కుమార్, హుసేన్ పాల్గొన్నారు.



రైతులు, ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ

# అవయవదాత ప్రాణదాత పావని లతకు అశ్రునివాళి



క్యాండిల్ ర్యాలీ చేస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైం,మేజర్ న్యూస్ :** పావని లత తాను మరణించినప్పటికీ ఆరు మందికి తన అవయవాలు దానం చేయడం ద్వారా వారికి ప్రాణదానం చేసి నేటికీ ఒక సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా మానవత,జన విజ్ఞాన వేదిక,రెడ్ క్రాస్ ఆద్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆమెకు ఘన నివాళిని అర్పిస్తూ క్యాండిల్ లైట్ ప్రదర్శన నిర్వహించారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తుల విషయంలో వారి కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు రావడం ద్వారా దాదాపు 8మందికి జీవితం కల్పించిన వారు అవుతారని అవయవ దాతల కుటుంబాలకి ప్రభుత్వం రూ.10లక్షలు ప్రకటిస్తే బాగుంటుందని వక్తలు కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు సురేష్ కుమార్,మాన వతా జిల్లా కన్వినర్ మనోహర్‌రెడ్డి,పాటిల్ హనుమంతరెడ్డి,శివారెడ్డి, శేషయ్య,రమణ,రాజు,మహిళా విభాగం నాయకులు అపర్ణ,దీప,లక్ష్మి సాంబ, సరోజ,రేష్మ,పోలీస్ లక్ష్మి,లెక్చరర్ సుంకన్న,అరుణ పాల్గొన్నారు.

# శ్రీ చౌడేశ్వరీ అమ్మవారికి పల్లకీ సేవ

**బనగానపల్లెమేజర్,న్యూస్:** శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి పల్లకి సేవను నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరీ అమ్మవారి దేవస్థానం నందు శుక్రవారంనాడు వైభవంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారంనాడు అమ్మవారి పల్లకి సేవను నిర్వహించడం ఆనవాయితి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో అలంకరించి వేద మంత్రోచ్ఛర నడుమ పల్లకిలో కూర్చొబెట్టి ప్రధాన ఆలయం చుట్టూ పల్లకి సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమీషనర్ మరియు ఆలయ నిర్వహణ అధికారిని కామేశ్వరమ్మ, ఆలయ అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# మహానందీశ్వరుని సన్నిధిలో జడ్జి పూజలు



**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రము ఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో నంద్యాల జడ్జి రాధారాణి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. శుక్రవారం క్షేత్రానికి వచ్చిన వీరికి ఆలయ మర్యాదలతో పర్యవేక్షకులు శశిధర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ కామేశ్వరీ సమే త మహానందీశ్వర స్వామి వార్లకు అభిషేకార్చన పూజలు నిర్వహించారు. వేద పండితులు రవిశంకర్ అవధాని, నాగేశ్వర శర్మ లు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేయగా అధికారులు శేష వస్త్రంతో సత్కరించారు.

# టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపించాలి

## – టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు హనుమంతరావు చౌదరి

**కర్నూలు,మేజర్ న్యూస్ ప్రతినిధి :** ఉమ్మడి గుంటూరు జిల్లాల పట్టభద్రుల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి,జనసేన,బిజెపి తరపున పోటీ చేస్తున్న తెదేపా సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని అఖండ మెజార్టీతో గెలిపించాలని తెదేపా సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు హనుమం తరావు చౌదరి కోరారు. నామినేషన్ సందర్భంగా శుక్రవారం గుంటూరులో హనుమంతరావు చౌదరి,ఆర్గనైజర్ సెక్రటరీ లక్ష్మి పద్మా చౌదరిలు ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ని మర్యాద పూర్వకంగా కలిసి తమ మద్దతు తెలియజేశారు. రాష్ట్రంలోని కళాకారులకు అభిమానిగా పేరుగాంచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ఓటు వేసి వేయించవలసిందిగా పట్టభ్రదుల ఓటర్లను అభ్యర్థించడం జరిగింది.



ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌తో హనుమంతరావు,లక్ష్మి పద్మాచౌదరిలు

# భక్తీ శ్రద్ధలతో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ,ధ్వజస్థంభ ప్రతిష్ఠ

**తుగ్గలి,మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని ముక్కెళ్ల గ్రామంలో శుక్రవారం శ్రీ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట,ధ్వజస్థంభ,కలశ స్థాపన ప్రతిష్ట కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ ప్రజలు విరాళాలతో నూతన ఆలయాన్ని నిర్మించి ఈ ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట,ధ్వజస్థంభ ప్రతిష్ట ,కలశ స్థాప కార్యక్రమాలను వేద బ్రాహ్మణ,పండితులు,వివిధ రకాల హోమ పూజలు చేసి ప్రతిష్టించారు. ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట అనంతరం ఆలయం ముందు ధ్వజస్థంభ ప్రతిష్ట అలాగే కలశ స్థాపన ప్రతిష్ట చేయనున్నారు. గ్రామంలోకి బంధుమిత్రులు రావడంతో గ్రామంలో పండగ వాతావరణం ఏర్పడింది. ఆడబిడ్డలకు కొత్త బట్టలు,ఒడిబియ్యం పెట్టి పూజలు చేశారు. రాత్రి పెండేకల్ చాకలి రంగన్న బృందం వారిచే చెక్క భజన కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఆలయం ముందు ధ్వజస్థంభ ప్రతిష్ట చేస్తున్న భక్తులు

# రజకుల సమస్యలను పరిష్కరించండి

## – రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రిని కలిసి వినతి

**కర్నూలు,మేజర్ న్యూస్ ప్రతిని ది :** రాష్ట్రంలో రజకుల సమస్యలను పరిష్కరించాలని ఏపి రజక వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ సావిత్రి బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవితను కోరారు. శుక్రవారం విజయవాడలో బిసి సంక్షేమ భవన్‌లో మంత్రిని మర్యా ద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రాయలసీమ జిల్లాల్లో బిసి కార్పొరేషన్ ఆద్వర్యంలో రుణాలకు సంబంధించి గడువు తేదీని పొడిగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా రజక సామాజిక వర్గానికి సంబంధించి జీఓ నెం. 6 రజక వెల్ఫేర్ కమిటీని ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో పెండింగ్‌లో ఉన్న దోబీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రజకులకే అవకాశం కల్పించాలని కోరారు. వీటన్నింటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.



మంత్రికి వినతిపత్రం అందచేస్తున్న రజక కార్పొరేషన్ ప్రతినిధులు

# మహానందిలో మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన ఈఓ

## – గోవుల రక్షణకు కంచె ఏర్పాటు

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో ఈ నెల 26 నుంచి జరిగే మహాశివరాత్రి పర్వదినం ఏర్పాట్లను ఆలయ ఈఓ నల్లకాల్వ శ్రీనివాస్ రెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. శుక్రవారం పార్కింగ్ స్థలాన్ని, క్యూ లైన్ ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు చేశారు. మహాశివరాత్రి సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగ కుండా ప్రశాంత వాతావరణంలో దర్శనం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. రానున్న వేసవి కాలంలో గోవుల సంరక్షణకై అడవిని ఆనుకుని ఉన్న గోశాల చుట్టూ ఆరు అడుగుల ఎత్తు వరకు కంచె ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తాగే నీటి కోసం అడవి జంతువులు కొండ దిగి వస్తాయనే అంచనాలతో గోవుల సంరక్షణకై ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సిబ్బందికి పలు సూచనలు చేస్తూ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. వీరి వెంట ఏఈఓ మధు, ఏఈ రవికుమార్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



గోశాల వద్ద సూచనలు చేస్తున్న ఈఓ

సూర్య
శనివారం | 08 ఫిబ్రవరి 2025

# నులిపురుగుల నివారణకు చర్యలు


సమావేశములో మాట్లాడుతున్న డా., మిథున్ రెడ్డి

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండల ప్రజా పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం నులిపురుగుల నివారణకు ప్రతేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల ప్రైమరీ హెల్త్ సెంటర్ డా,, మిథున్ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ఆరోగ్యశాఖ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10న జాతీయనులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తారు. అందులో భాగంగా నేటినుడి మండల వ్యాప్తంగా వున్నా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్ల లలో 1నుండి 19 సంవత్సరాల మధ్య పిల్లల్లకు నులిపురుగుల బారి నుండి తొలగించాలి. అందుకు ఆయా పాఠశాల పధానోపాధ్యాయులు పిల్లలకు అవగాహనా కలిపించాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయనీ, కలుషిత ఆహారం, ఈగలు వాలిన తినుబండారాలు దుమ్ము దూళి పడిన ఆహార పదార్థాలు తినడం వల్ల బహిరంగా మాళవిసర్జన చేయడం వల్ల నులి పురుగులు ఏర్పడుతాయని సూచించాలని తెలిపారు. ఇంజనీరింగ్ నివారణకు ఆల్బెండాజోల్ మాత్రలు వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమములో ఎంపీడీఓ. రాణెమ్మ, మండల విద్యాధికారినీ జ్యోతి, ఆడంభాష, మండల పిహెచ్సి డా,, మిథున్ రెడ్డి, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శివరామయ్య అరెస్ట్


శివరామయ్యకు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** బనగానపల్లె ఈ.ఒగా , ఈఒఆర్డీగా గత ప్రభుత్వంలో సేవలు అందించిన శివరామయ్యను శుక్రవారంనాడు నందివర్గం పోలీసులు అరెస్టు చేశారు. పలుకూరు మేజర్ గ్రామ పంచాయతీలో బిల్‌కలెక్టర్‌గా పని చేస్తున్న పుల్లయ్యను పర్మినెంట్ చేయాల్సి ఉన్నా అందుకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు పంపించడంలో జాప్యం చేస్తున్నారని అందుకు మనస్థాపం చెంది జనవరి నెలలో సూసైడ్‌నోట్ వ్రాసి అతని మరణానికి కారణం శివరామయ్య అని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఆత్మహత్యాయత్నం చేసిన పుల్లయ్య కోలుకోలేక మృతి చెందాడు. దీనిపై ఆరా తీసిన ఉన్నతాధికారులు శివరామయ్యను దోషిగా తేల్చడంతో నందివర్గం పోలీసులు వారిని అరెస్టు చేసి బనగానపల్లె ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం రిమాండ్‌కు తరలించారు.

## అహోబిలేశునికి పూజలు నిర్వహించిన ఎడి ఈ రవికాంత్


ఉత్సవ పల్లకిని మోస్తున్న ట్రాన్స్కో ఏడీఈ రవికాంత్ చౌదరి

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** పారువేట ఉత్సవాలలో భాగంగా అహోబిలేశులు కొలువైన ఉత్సవ పల్లకి ఆళ్లగడ్డ పట్టణం నుండి శుక్రవారం ఎస్ లింగ ందిన్నే గ్రామానికి బయలుదేరింది. మార్గమధ్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ దగ్గర ట్రాన్స్కో ఏడిఈ రవికాంత్, ఏఈ కృష్ణయ్య బృందం నరసింహ స్వాములకు పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏడీ రవికాంత్ పారువేట ఉత్సవ పల్లకిని స్వయంగా మోయడం జరిగింది.

## బీసీలకు రాజ్యాధికారం చంద్రబాబుతోనే సాధ్యం


మాట్లాడుతున్న రాష్ట్ర కురువ కార్పోరేషన్ డైరెక్టర్ రామకృష్ణ

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** బీసీలకు రాజ్యాధికారం సీఎం చంద్రబాబునాయుడి తోనే సాధ్యం అవుతుందని రాష్ట్ర కురువ కార్పోరేషన్ డైరెక్టర్ రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నామినేటెడ్ పదవులలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ క్యాబినేట్ ఆమోదం తెలపడం చారిత్రాత్మక నిర్ణయం అని ఆయన కొనియాడారు. కూటమి ప్రభుత్వం బీసీలకు అగ్రతాంబ లం ఇచ్చిందని గత వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ 29 శాతానికి తగ్గించి బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. ఎన్నికలలో టీడీపీ బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చిందని టీడీపీ బీసీల అభ్యున్నతి కోరే పార్టీ అని మరోసారి నిరూపించిందని తెలిపారు. బీసీల తరుపున సీఎం చంద్రబాబునాయుడికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు రాముడు, కురువ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని కోవెలకుంట్ల సిఐ హనుమంతు నాయక్ హెచ్చరించారు. శుక్రవారం గ్రామ పంచాయితీ పరిధిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అలాంటి వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే నెంబర్ ప్లేట్ లేని వాహనాలు రోడ్లపై తిరిగితే ఆ వాహనాలు స్వాధీనం చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. నెంబర్ ప్లేట్ ఉన్న వాహనాలు మాత్రమే రోడ్లపై తిరగాలని అన్నారు. ఎస్సై మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించి లైసెన్స్ లేని వాహనాలను గుర్తించి జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

# విద్యార్థులు పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలి

**– జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి**


విద్యార్థులతో మాట్లాడుతున్న డి.ఈ.ఒ జనార్ధన్ రెడ్డి

**దొర్నిపాడుమేజర్,న్యూస్‌:** విద్యార్థులు పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని నంద్యాల జిల్లా విద్యాశాఖ అధికారి జనార్ధన్ రెడ్డి విద్యార్థినీ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన దొర్నిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో మాట్లాడుతూ రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సాధించాలని ఆయన సూచించారు. విద్యార్థులకు విద్యతోపాటు క్రీడా పోటీల్లో కూడా పాల్గొనాలని ఆయన సూచించారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆయన కోరారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధపెట్టిందని విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తుందని ప్రతి ఒక విద్యార్థి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు రజాక్ బాష , మల్లి, చెన్నయ్య, రవిప్రకాస్ , విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**– గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా సహకరించుకోవాలి**
**– డిఎస్పి రామాంజి నాయక్, సిఐ రాము**



గ్రామ సభలో మాట్లాడుతున్న డిఎస్పి రామాంజి నాయక్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** సమాజంలో జరుగుతున్న నేరాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండి వాటి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిఎస్పి రామాంజి నాయక్, సిఐ రాములు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కురుకుంద గ్రామంలో జల్లా ఎస్పి ఆదేశాలకు పోలీసులు గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి, సిఐలు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల గురించి వివరిస్తు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెంట్ వాడాలని , మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని, ఏదో ఆశచూపుతూ సులువుగా ప్రజలను మోసం చేస్తున్నారని, ఓటిపి వంటి వాటినికి తెలియని వ్యక్తులకు చెప్పిమోసపోవద్దన్నారు. మహిళలపై జరిగే నేరాలు గురించి వివరించారు. ఎవ్వరూ కూడా బాల్యవివాహాలను ప్రోత్సహించరాదని బాల్య వివాహాలు చట్టరీత్య నేరమన్నారు. దొంగతనాలు, చైన్ స్నాకింగ్ జరుగుతున్నాయని , ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. చీకట్లే వాకింగ్‌కు వెళ్లే టప్పుడు ఒంటరిగా వెళ్ళరాదన్నారు. అలాగే రైతులు పొలాలకు మందులు పిచికారి చే సేటప్పుడు ముఖానికి మాస్క్ లేదా, గుడ్డ కట్టుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయని, చిన్న చిన్న వాటికి మనస్థాపానికి గురై ఆత్మహత్యలు చేసుకోరాదని, ఏదైన సమస్య ఉంటే నేరుగా పోలీసు స్టేషన్‌కు వస్తే పరిష్కరిస్తామని అన్నారు. గ్రామంలో అన్ని వర్గాల వారు సోదరభావంతో మెలుగుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, గ్రామ టిడిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కేసీ వెంట ముళ్ళ పొదల పంట

- **అడవిని తలపిస్తున్న కేసీ కాల్వ**
- **పొలం వెళ్ళాలంటే అన్నదాతల అవస్థలు**
- **కేసీ కాల్వ సామర్థ్యానికి ముప్పు**
- **ముళ్ళ కంపలతో మూసుకుపోయిన తూములు**
- **ఏళ్ళుగడిచిన పట్టించుకోని అధికారులు**


కేసీ వెంట అడవిని తలిపిస్తున్న దృశ్యం

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** కర్నూలు– కడప కాల్వలను కేసీకెనాల్ అని పిలుస్తారు. బండిఆత్మకూరు మండలంలోని సంతజూటూరు అనకట్ట వద్ద కేసీకెనాల్ కాల్వ విస్తరించి ఉంది. సంతజూటూరు వద్ద ప్రారంభమై బండిఆత్మకూరు, తిమ్మాపురం, ఈర్నపాడు, బి.కోడూరు మీదుగా నంద్యాల మండలంలోనికి కేసీకెనాల్ ప్రవేశిస్తుంది. ఈ కేసీకెనాల్ కింద వేలాది ఎకరాలు వివిధ రకాలైన పంటలు సాగుచేయబడి ఉంటున్నాయి. కేసీకెనాల్ కట్ట వెంట ఇరువైపులా ముళ్ళ పొదలు అల్లుకుపోయాయి. అంతే కాకుండా కాల్వ వెంట ఏర్పాటు చేసిన తూములు ఎక్కడున్నాయో గుర్తు పట్టడానికి కూడా ఆస్కారం లేకుండా పోయింది. రైతులు తమ పొలాలకు నీరు వదులుకోవడానికి కూడా ఇబ్బందిగా తయారైన పరిస్థితి. తూములలో ముళ్ళ పొదలు ఏర్పడటంతో నీటి సరఫరాకు ఎంతో అవస్థలు పడుతున్నారు. అయితే కొన్ని సంవత్సరాలుగా కేసీకెనాల్ అధికారులు కాల్వ వెంట రహదారులను పట్టించుకోకపోవడంతో ముళ్ళ పొదలతో నిండుగా అల్లుకుపోయాయి. కేసీ కెనాల్ అధికారులు తూముల పరిశీలనకు కూడా అధికారులు వెళ్ళడానికి వీలులేకుండా దారులు మూతపడ్డాయి. ప్రతి సంవత్సరం జంగిల్ క్లియరెన్స్ చేయాల్సిన అధికారులు ఎందుకు చేయడం లేదో అర్థం కాని పరిస్థితి. ఒక వేళ నిధులు వస్తున్నా చేసినట్లు మాయ చేస్తున్నారేమోనని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి కేసీ కెనాల్ వెంట ఉన్న ముళ్ళ పొదలను తొలగించే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. తూములకు మరమ్మత్తులు చేయించాలని బండిఆత్మకూరు మండల ప్రజలు మేజర్ న్యూస్ ద్వారా కోరడం జరిగింది.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన కరపత్రం విడుదల..ఎంపీడీవో సుహాసినమ్మ

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమముకి సంబంధించిన వాల్ పోస్టర్స్ ,కరపత్రికలను గోవర్ధనగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో శుక్రవారం మండల అభివృద్ధి అధికారి సుహాసినమ్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల10వ తేదీన జరిగే జాతీయ నులిపురుగుల నిర్మాణ కార్యక్రమంలో ఆల్బెండజబుల్ 400ఎంజి మాత్రలు మండలంలోని అన్ని అంగన్వాడి సెంటర్లకు మరియు అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో, మరియు కళాశాలకు ఇవ్వడం జరిగినద మీ ఆమె తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థిని,విద్యార్థులందరూ ఉపయో గించుకొని రక్తహీనత రాకుండా నివారించుకోవాలని తెలియజేశా రు. ఈ కార్యక్రమంలో గోవర్ధనగిరి వైద్య అధికారి డాక్టర్ కె. నవీన్ కుమార్, డాక్టర్.ఎన్. శ్రీధర్ రెడ్డి మరియు ఫిమేల్ సూపర్వైజర్ ఎస్. నాగలక్ష్మి మరియు సంచార చికిత్స హెల్త్ అసిస్టెంట్ నాగన్న, తదితరులు పాల్గొన్నారు.



# భూ రీసర్వే పనులను తనిఖీ చేసిన ఆర్డీఓ



రీ సర్వే పనులపై మండల రెవిన్యూ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ. కిదారి సందీప్ కుమార్

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలో జరుగుతున్న భూ రీసర్వే పనులను శుక్రవారం ఆర్డిఓ కిదారి సందీప్ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్బంగా రీ సర్వే పనులుపై ఆరా తీశారు. రీ సర్వే లో భూ యజమానుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. రీ సర్వే యాక్షన్ ప్లాన్ తదితర విషయాలను ఆర్డిఓ కు వివరించారు. తనిఖీ లో భాగంగా మండల పరిధిలోని గొల్లల దొడ్డి గ్రామములోని సర్వే నెంబర్ 21,22,23 కు సంబందించిన భూ సమస్యను మండల ఇంచార్జి తహసీల్దార్ పురుషోతమ్ముడు, మండల సర్వేయర్ నాగభూషణంతో కలసి పరిశీలించారు, అనంతరం సంబంధిత రైతులు గొల్ల రమేష్, గొల్ల కృష్ణ ల తో మాట్లాడి వీలైంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. రీ సర్వే డిటి. వెంకటేశ్వర్లు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సంకల్ప్ పాఠశాలలో ఘనంగా స్పెక్టాక్యులర్ స్పోర్ట్స్ గాలా 2025

**విద్యార్థుల శారీరక మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయి.. జిల్లా రవాణా శాఖ అధికారి ఐశ్వర్యా రెడ్డి**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణం లోని బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీ సంకల్ప్ పాఠశాల లో స్పెక్టాక్యులర్ స్పోర్ట్స్ గాలా2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా జిల్లా రవాణా శాఖ అధికారి ఐశ్వర్యా రెడ్డి శ్రీ సంకల్ప్ విద్యా సంస్థల అధినేత సుధాకర్ వారి సతీమణి రమ్యా రెడ్డి.ప్రిన్సిపల్ పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. స్కూల్ చైర్మన్ సుధాకర్ ఆధ్వర్యంలో ర్యాలీతో స్కేటింగ్,డ్రమ్స్ లతో విద్యార్థులు బాలాజీ కాంప్లెక్స్ నుండి సంకల్ప్ పాఠశాల వరకు ర్యాలీ ని నిర్వహిస్తూ ముఖ్య అతిథి జిల్లా రవాణా శాఖ అధికారి ఐశ్వర్య రెడ్డిని స్వాగత సత్కారాలతో ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మొదటగా జ్యోతి ప్రజ్వలన గావించి , ముఖ్య అతిథి జాతీయ పతాకాన్ని ఆవిష్కరణ చేయగా, చైర్మన్ సుధాకర్‌వారి సతీమణి రమ్యా రెడ్డి , ప్రిన్సిపాల్,విద్యార్థుల ప్రత్యేక విభాగలపతాకాలను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఐశ్వర్యారెడ్డిమాట్లాడుతూ విద్యార్థుల శారీరక మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని,క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చే విద్యాలయాలు ఈ మధ్యకాలంలో చాలా అరుదుగా కనిపిస్తున్నాయని, కానీ ఈ పాఠశాలను చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని, క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం,విద్యార్థులకు ప్రోత్సాహాన్ని అందించడమే కాక ప్రత్యేక స్పోర్ట్స్ గాలా నిర్వహించడం చూస్తుంటే... నాకు



చిన్నప్పుడు ఇలాంటి పాఠశాల వాతావరణం ఉండి వుంటే ఎంత బాగుండేదో!అనిఆశ్చర్యం వ్యక్తం చేశారు. చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ.. ఆటలంటే ఓటమి గెలుపే కాదు, సహ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారి గెలుపుని సహితం తాము ఆనందంగా స్వీకరించాలని తెలిపారు.పాఠశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ మా పాఠశాలలో అద్భుత క్రీడా ప్రాంగణంతో పాటు అనేక క్రీడా సదుపాయాలు అందించిన చైర్మన్ సుధాకర్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకి వారి తల్లిదండ్రులకి వివిధ ఆటలపోటీలను నిర్వహించి అందులో గెలుపొందిన వారికి బహుమతులను బహుకరించారు.క్రీడలకు సంబంధించిన నృత్య ప్రదర్శనలతో చిన్నారులు చూపరులను ఆకట్టుకున్నారు.పాఠశాల ప్రాంగణమంతా క్రీడా విభాగానికి సంబంధించిన చిత్రాలతో కనువిందు చేసింది.ఉన్నత తరగతుల విద్యార్థులకు ప్రత్యేక క్రీడా పోటీలను (ఖో ఖో, కబ్బడి , త్రోబాల్, క్రికెట్) నిర్వహించారు.అందులో విజేతలైన విద్యార్థులకు ప్రతి విభాగములోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులను చైర్మన్ సుధాకర్ చేతుల మీదుగా ప్రధానం చేసారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులకు మధ్య వినోదాత్మకమైన క్రీడాపోటీలను నిర్వంచి ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయంవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా స్కూలు యాజమాన్యం ధన్యవాదములు తెలిపారు.

# యాజమాన్య పద్ధతితో రైతులు అధిక దిగుబడులుసాధించవచ్చును



సదస్సులో మాట్లాడుతున్న జపాన్ బృందం సభ్యులు

**గోనెగండ్ల, మేజర్ న్యూస్:** రైతులు యాజమాన్యపద్ధతులు పాటించి అధిక దిగుబడులను సాధించవచ్చునని ధనూకా జపాన్ బృందం సభ్యులు సాజల్ బిస్వాస్ సాన్, పూజితా సాన్ అన్నారు. శుక్రవారం వీరంపల్లి గ్రామంలో బూడిద తెగులు నివారణ చర్యల రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ధనూకా కంపెనీ వారు రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. సాగు చేసిన ఉల్లి, మిరప తోపాటు పలు పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మిరప, ఉల్లి, వేరుశనగ, తదితర పంటలలో బూడిద తెగులు అధికంగా వస్తుందని ఈ తెగులు లావెల్లులా టౌరికా అనే ఫంగస్ వల్ల వస్తుంది ఈ తెగులు సోకిన వెంటనే ఆకు దిగువ బాగంలో చిన్న తెల్లటి మచ్చలు కనిపిస్తాయని ఫంగస్ పెరుగుదలనుబట్టి ఆకు పై భాగంలో లేత పసుపు రంగు మచ్చలు వ్యాపిస్తాయని తెలిపారు. ఇందుకు కాను నిస్సోడియమ్ అనే మందును వాడాలని రైతులకు సూచించారు. అలాగే పలు రకాల పంటలలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను, యాజమాన్య పద్ధతులను,



మిపరపంటను పరిశీలిస్తున్న జపాన్ బృందం సభ్యులు

పంటసాగుకు ముందు వాలుకు అడ్డగా దున్నడం వల్ల కలిగే ఫలితాను వారు వివరించారు. ఈ కార్య క్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్ హస్సేన్ వలి, డీజీఎం పరశురామయ్య లోకేశ్వరరెడ్డి, మోహన్రెడ్డి, ఎల్బీ వెంకటేశ్వర్లు, కే. శ్రీనివాసులు, కర్నూలు టీమ్ సభ్యులు, వీరంపల్లి, తిప్పనూరు, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# పంట నమోదు తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ బి .నవ్య

**వెల్దుర్తి,మేజర్ న్యూస్:** మండలంలోని రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు గ్రామ రెవెన్యూ అధికారులు చేసిన పంట నమోదు వివరాలను జాయింట్ కలెక్టర్ బి .నవ్య శుక్రవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేయడం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారి అక్బర్ బాషా తెలిపారు. మండల పరిధిలోని సూదేపల్లి గ్రామంలోని రైతు గొల్ల వెంకటేశ్వర్లు సాగు చేసిన ఉల్లి మరియు వేరుశనగ పంటలను పరిశీలన చేసి రైతులతో సాగు వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీమతి పిఎల్. వరలక్ష్మి,జిల్లా ఉద్యానవన అధికారి శ్రీ రామాంజనేయులు,తహసిల్దార్ శ్రీ చంద్ర శేఖర వర్మ, డిప్యూటీ తహసిల్దార్ గురు స్వామి రెడ్డి, వెల్దుర్తి, మండల సర్వేయర్ హేమంత్ కుమార్ రెడ్డి,వెల్దుర్తి ఉద్యానవన అధికారి నరేష్ రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారి కేకే మద్దిలేటి, ఆర్ఎస్ కే సిబ్బంది కలాం, ఎంపీఇఓ రమాదేవి, సచివాలయం సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.



# మల్లన్న సేవలో ఎమ్మెల్యేలు జె.సి. అస్మిత్ రెడ్డి,ప్రభాకర్ రెడ్డి

**-దేవస్థానానికి బంగారు వస్తువులు సమర్పణ**



**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను ఎమ్మెల్యేలు జెసి అస్మిత రెడ్డి, ప్రభాకర్ రెడ్డిలు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు దేవస్థానానికి బంగారు వస్తువులను విరాళంగా సమర్పించారు.379 గ్రాములతో తయారు చేయించిన బంగారు కూర్మ సింహాసనం,249 గ్రాములతో తయారు చేయించిన బంగారు పళ్ళెమును దేవస్థానమునకు సమర్పించారు.అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు ఈ కూర్మ సింహాసనం,పళ్ళెమును కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు,అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయ స్వామివార్లకు అందజేయడం జరిగింది.అనంతరం వారికి వేదాశీర్వచనముతో శ్రీస్వామి అమ్మవార్ల శేషవస్త్రాలను, ప్రసాదాలు అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమములో సహాయ కార్యనిర్వహణాధికారి బి. మల్లికార్జునరెడ్డి,ప్రజాసంబంధాల అధికారి టి.శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

# ప్రధానమంత్రి ఆదర్శ గ్రామంగా వేంపెంట

**పాములపాడు, మేజర్ న్యూస్ :** పాములపాడు మండల పరిధిలోని వేంపెంట గ్రామం ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకానికి ఎంపిక కాబడిందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామ యోజన అనేది గ్రామీణ అభివృద్ధి కార్యక్రమం, ఇది కేంద్ర మరియు రాష్ట్ర పథకాల కలయిక మరియు ఆర్థిక కేటాయింపుల ద్వారా షెడ్యూల్డ్ కులాలకు చెందిన ప్రజల నిష్పత్తి ఎక్కువగా ఉన్న గ్రామాల అభివృద్ధికి తోడ్పడుతుందని గ్రామాల వారీగా నిధులు వస్తాయని తెలిపారు. గ్రామ అభివృద్ధి కోసం నివేదిక రూపొందిస్తున్నామన్నారు అందులో భాగంగా వెంపెంట గ్రామాన్ని పరిశీలించామని ఎంపీడీవో తెలిపారు ఆయన వెంట సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీవో చంద్రశేఖర్

# బీసీ కార్పొరేషన్ రుణాల దరఖాస్తు సమయం పొడగింపు

**ఓర్వకల్లు ,మేజర్ న్యూస్ :** బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 12వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. బ్యాంకు అనుసంధానంతో సబ్సిడీతో కూడిన రుణాలకు సంబంధించి అర్హత కలిగిన లబ్ధిదారులు ప్రభుత్వ వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకునేందుకు ఏడవ తేదీశుక్రవారం గడువు ముగిస్తున్నందున ఈ నెల 12వ తేదీ వరకు ప్రభుత్వం పొడిగించిందని కావున అర్హత గలవారు అప్లై చేసుకోవాల్సిందిగా తెలిపారు.

# మధ్యాహ్న భోజనంలో నాణ్యత పాటించాలి



**ఓర్వకల్లు,మేజర్ న్యూస్ :** విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్నభోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంఈఓ ఓంకార్ యాదవ్ అన్నారు.శుక్రవారం మండలకేంద్రం లోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్ లను అయన తనిఖీ చేశారు. పాఠశాలకు హాజరైన విద్యార్థుల సంఖ్య,ఉపాధ్యాయులహాజరు శాతం, మధ్యాహ్నభోజనరికార్డులనుపరిశీలించారు.అనంతరంమధ్యాహ్నం భోజనాన్ని రుచిచేశారు. విద్యార్థులకు మెనూప్రకారం భోజనంపెట్టాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండ పాఠశాలకు హాజరయ్యేలా చూడాలని ఆయా పాఠశాలలప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల ప్రధానో పాధ్యాయులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పారువేట ఉత్సవ పల్లకికి ఘన స్వాగతం పలికిన ఇరిగెల బృందం

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** పారువేట ఉత్సవాలలో భాగంగా నరసింహ స్వాములు కొలువైన ఉత్సవ పల్లకి శుక్రవారం చేరుకుంది. సందర్భంగా గ్రామ పెద్దలు జనసేన నాయకులుఇ రిగెల రామచంద్రారెడ్డి బృందం ఉత్సవ పల్లకికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు నరసింహ స్వామికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇరిగెల శ్రీనివాస్ రెడ్డి ,దస్తగిరి ,దూదేకుల సీతన్న ,మిద్దె రామ పుల్లయ్య, జానకి రాముడు తదితరులు పాల్గొన్నారు.



పూజ లునిర్వహిస్తున్న దృశ్యం

# బస్సులో వ్యక్తి మృతి

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్:** తాడిపత్రి నుండి జమ్మలమడుగు బస్సు ఎపీ39 2279లో ప్రయాణిస్తుండగా యాపరాళ్ల గ్రామానికి చెందిన శివనాగయ్య (40) అనే వ్యక్తి మందు సేవించి వెనుక భాగానా కూర్చున్నాడు ఉన్నట్లుండి సీట్లో నుండి కిందపడిపోవడంతో ప్రయాణికులు ఎంత ప్రయత్నించినా లేవకపోవడంతో బస్సును పోలీసు స్టేషన్‌కు తీసుకొని రావడంతో అతని చనిపోయినట్లు కేసు నమోదు చేసుకొని అతని బంధువులకు సమచారం ఇచ్చారు.



# పోలీసుల సమస్యల పరిష్కార కోసమే గ్రీవెన్‌సెల్

## – నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా



జిల్లా ఎస్పీకి సమస్యలు వివరిస్తున్న పోలీస్ సిబ్బంది

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కార కోసమే పోలీస్ గ్రీవెన్‌సెల్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు. శుక్రవారం బొమ్మలసత్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ సిబ్బందికి గ్రీవెన్‌సెల్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 10 మంది పోలీస్ సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వేస్ట్ బదిలీ గురించి ఎస్పీకి విన్నవించుకున్నారు. సమస్యలపై ఎస్పీ స్పందించి పరిష్కరిస్తామని ఎస్పీ బరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అన్నారు. విధి నిర్వహణలో సిబ్బంది సతమతపడకుండా వారికి ఉన్న ఇబ్బందులను తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు చేయడమే లక్ష్యంగా పని చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు తీర్చేందుకే గ్రీవెన్స్ కార్యక్రమం : మంత్రి ఫరూక్



**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి శనివారం ఆయా నియోజకవర్గాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర న్యాయ, మైనార్టి సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నంద్యాల పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి తెలిపారు.

# డిటోనేటర్ జిలిటిన్ పేలి వ్యక్తికి తీవ్రరక్త గాయాలు

## ■ భారీ శబ్దానికి అక్కడికక్కడే కుప్పకూలీన కూలీలు



మేకడోనాలో డిటోనేటర్ పేలిన స్థలం పరిశీలిస్తున్న పోలీసులు




డిటోనేటర్ పేలి గాయాలు పాలైన వ్యక్తి

**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని మేకడోనా గ్రామంలో అదే గ్రామానికి చెందిన ఈడిగ నారాయణ స్వామి గౌడు పోలంలో డిటోనేటర్ పేలి ఇబ్రహీం అనే వ్యక్తికి తీవ్ర రక్త గాయాలయ్యాయి. భారీ పేలుడు శబ్దానికి మరో ఐదు మంది కూలీలు అక్కడికక్కడే కింద పడి పోయారు. పెద్దకడుబూరు పోలీసులు. భాదితులు గ్రామస్తులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మేకడోనా గ్రామానికి చెందిన ఈడిగ నారాయణ స్వామి గౌడు ఇంటికి సమీపంలో తనకున్న రెండు ఎకరాల స్వంత పోలం ఇంటి ప్లాంటు వేయడం జరిగిందని తెలిపారు. అయితే పోలంలో వేసిన ప్లాట్లును కొనుగోలు చేయడానికి ఎవ్వరు ముందుకు రాకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న వందగల్ లక్ష్మన్న అనే వ్యక్తికి అప్పుజెప్పినట్లు చెప్పారు. అయితే ప్లాట్లు వేసిన పొలం పెద్ద పెద్ద బండరాళ్ళ ఉన్నందున గత రెండు రోజులునుండి కూలీలు సహాయం తో పోలంలో ఉన్న చెత్తను తొలగించే పనులు చేపట్టినట్లు చెప్పారు. అలాగే బండ రాళ్లను తొలగించించేందుకు కప్పటి గ్రామానికి చెందిన లాజర్ అనే వ్యక్తి ద్వారా కంప్రెసర్ డిటోనేటర్ సహాయం తోబండ రాళ్లను తొలగించే పనులు జరుగుతున్నాయి. గురువారం రోజున అధే గ్రామానికి చెందిన కొంతమంది కూలీలతో ప్లాట్లు వేసిన పోలంలో చెత్త చెదారాన్ని ఎరి ఒక చోట కుప్ప కుప్పలుగా పోసిన చెత్తను బండరాళ్ళను తొలగించే పేలుడు పదార్థాలు జిలాటిన్ డిటోనేటర్ వైర్లను చెత్త కుప్పులో లేని విషయాన్ని తెలుసుకో లేక పోయిన కూలీలు చెత్త కుప్పకు నిప్పు పెట్టి కొంతదూరం అక్కడే నిలబడి పోయారని చెప్పారు. చెత్త కుప్పలు మంటదగ్గర ఇబ్రహీం అనే వ్యక్తి అక్కడే నిలబడి ఉండటంతో అంతలోపే భారీ శబ్దంతో మందుగుండు పేలి ఇబ్రహీం అనే వ్యక్తికి ముఖం ఎద పైన తనశరీరానికి అక్కడక్కడ తీవ్ర రక్త గాయాలయ్యాయి. గాయాల పాలైన వ్యక్తిని మెరుగైన వైద్యం కోసం ఓ ప్రవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. మిగిలిన కొంత మంది కూలీలు నెమ్మదిగా తేరుకొన్నారని వారు తెలిపారు. దీనంతటికి కారణం నిర్లక్ష్యంగా వ్యవహరించిన కాంప్రెజర్ యాజమాని అయిన కప్పటి గ్రామానికి చెందిన లాజర్ నిర్లక్ష్యం వ్యవహరించడం. అధేవిధంగా ఎలాంటి లైసెన్సులు లేకుండా మందు గుండు సామాగ్రి అక్రమంగా కలిగి వాటిని పేల్చేసిన వారుఈడిగ నారాయణస్వామి గౌడు. వందగల్ లక్ష్మన్నలపై బాదితుడు ఇబ్రహీం పెద్దకడుబూరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు.

# అంగరంగ వైభవంగా శ్రీ భద్రకాళి వీరభద్ర స్వామి రథోత్సవం

## – స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు



స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని హోసూరు గ్రామంలో భద్రకాళి వీరభద్రస్వామి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గురువారం హోసూరు గ్రామంలో వీరభద్రస్వామి రథోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబును, భాజాభజంత్రీలతో, మేళతాళాలతో, తప్పేట్లతో గ్రామ టీడీపీ నాయకులు, ప్రజలు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రథోత్సవానికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ఊరేగించారు. ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని కోరుకున్నారు. అనంతరం రథోత్సవాన్ని పురవీధులగుండా భక్తాదులతో కలిసి ఊరేగించారు. రథోత్సవానికి ప్రక్క గ్రామాల నుండి అధిక సంఖ్యలో భక్తాదులు, ప్రజలు పాల్గొన్నారు. రథోత్సవంలో ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ జయన్న ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, తుగ్గలి నాగేంద్ర బత్తిన వెంకట్రాముడు, టీడీపీ గ్రామ నాయకులు హోసూరు ఆంజి, సంజప్ప, తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జా అంశంపై తెర వెనుక ఎవరూ ?

- ■ ఆరేళ్ళుగా అవే ఆరోపణలు
- ■ హక్కు లేదని తేల్చిచెప్పిన రెవెన్యూ శాఖ
- ■ కోర్టుకు వెళ్ళాలని ఆదేశాలు
- ■ తాజాగా మరోసారి కత్తి శ్రావణి తీవ్ర ఆరోపణలు
- ■ డాక్టర్ మధుసూదన్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అధికారులపై ఆరోపణలు



భూ కబ్జాపై పత్రాలను చూపిస్తున్న కత్తి శ్రావణి

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల మున్సిపల్ పరిధిలోని రైతునగర్‌లో రూ. 30 కోట్ల విలువైన స్థలం కబ్జా అంశం మరోసారి జిల్లా కేంద్రంలో మరోసారి దుమారాన్ని రేపింది. బాధితురాలు కత్తి శ్రావణి పాత్రికేయుల సమావేశంలో ప్రముఖ డాక్టర్ మధుసూదన్‌రావు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, పోలీసు శాఖలోని అధికారులపై ఆరోపణలు చేశారు. జిల్లాలోని ఒక నియోజకవర్గంలో జరిగిన ఒక ఘటనను తెరమరుగు చేసేందుకు భూకబ్జా అంశాన్ని తెర పైకి తెచ్చినట్లు తెలుస్తోంది. 2019 నుంచి కత్తి శ్రావణి అంశం ప్రస్తుతం జిల్లా కేంద్రమైన నంద్యాలలో ప్రతిసారి చర్చకు వస్తూనే ఉంది. గడచిన ఆరేళ్ళుగా కత్తి శ్రావణి ఆరోపణలు చేస్తూ వస్తున్నారు. కత్తి శ్రావణికి ఎలాంటి హక్కు లేదని రెవెన్యూశాఖ ఆర్‌ఓఆర్ కేసులో స్పష్టం చేస్తూ కోర్టుకు వెళ్ళాలని ఆదేశించింది. తాజాగా కత్తి శ్రావణి ఆరోపణల వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల నుంచి తెలుస్తోంది. గడచిన ఏడాదిన్నరగా నిశ్శబ్దంగా ఉన్న కత్తి శ్రావణి శుక్రవారం భూ కబ్జాపై పాత్రికేయుల సమావేశం ఉన్నట్లు సోషల్ మీడియాలో ప్రకటన విడుదల చేశారు. ఒక లాడ్జిలో భూ కబ్జాకు సంబంధించిన అంశంపై పాత్రికేయులకు వివరాలను వెల్లడించారు. పొరుగు నియోజకవర్గంలో జరిగిన ఒక ఘటన అనంతరం కత్తి శ్రావణి ఆరోపిస్తున్న రూ. 30 కోట్ల విలువైన భూ కబ్జా తె రపైకి మరోసారి తెచ్చినట్లుగా తెలుస్తోంది. కత్తి శ్రావణి తెర వెనుక అధికార పార్టీ నాయకుడు ఒకరు ఉన్నట్లు తెలుస్తోంది. కత్తి శ్రావణి తాజాగా తన ఆరోపణలలో మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ప్రధానంగా ప్రస్థావించడంతో ఒక్కసారిగా రాజకీయ దుమారానికి కేంద్ర బిందువుగా మారింది. నంద్యాల మాజీ తహశీల్దార్ డక్క రవికుమార్ బదిలీ వెనుక అప్పటి అధికార పార్టీ ఎమ్మెల్యే అయిన శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి ఉన్నట్లుగా ఆరోపించారు. కత్తి శ్రావణి నంద్యాల తహశీల్దార్ కార్యాలయం మొదలుకొని జాయింట్ కలెక్టర్, కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విధితమే. కత్తి శ్రావణి తాజా ఆరోపణలో డాక్టర్ మధుసూదన్‌రావుకు స్వయాన బావమరిది అయిన బొగ్గరపు నాగరాజును భూ కబ్జాదారుడిగా అభివర్ణించారు. ఈ నేపథ్యంలో కత్తి శ్రావణి ఆరోపణలపై డాక్టర్ మధుసూదన్‌రావు స్పందించారు. శనివారం మధ్యాహ్నం పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసినట్లు మేజర్‌న్యూస్‌కు తెలిపారు.

# జగన్ అసత్యాలను ప్రజలు నమ్మరు..!



మాట్లాడుతున్న కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

**కర్నూలు,మేజర్ న్యూస్ ప్రతినిథి :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసిన జగన్ మోహన్‌రెడ్డి నేడు కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మడం విడ్డూరంగా ఉందని ఆయన అసత్యాలను ప్రజలు నమ్మరని కూడా చైర్మన్,టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు విమర్శించారు. శుక్రవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చెప్పిన అపద్దాలనే మరలా మరలా చెప్పడం అపద్దాలను నిజాలుగా చిత్రీకరించ డంలో జగన్ ఆరితేరారని విమర్శిం చారు. బూటకపు ప్రెస్‌మీట్ పెట్టి అసత్యాలు చెబితే ప్రజలు నమ్మేస్థితిలో లేరని ఇలాంటి కుతంత్రాతలను ఇకనైనా మానుకోవాలని హితవు పలికారు.

# పారిశుద్ధ్య పనులపై ఆకస్మిక తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న కమీషనర్

**కర్నూలు నగరం,మేజర్ న్యూస్ :** నగరంలోని వెంకటరమణ కాలనీ,అశోక్ నగర్,ఇందిరాగాంధీ నగర్,రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను శుక్రవారం నగర పాలక కమీషనర్ ఎస్ రవీంద్రబాబు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని,ఫిర్యాదులు పునరావృతం కాకుండ చూడాలని సూచించారు.